క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన 'బొమ్మిశెట్టి'



నరసింహారావుపాలెం(వీరులపాడు): రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా బొమ్మిశెట్టి భాస్కర రావు తాడేపల్లిలోని కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్వగ్రామం నరసింహారావుపాలెం చేరుకున్న భాస్కరరావును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, సచివాలయల కన్వీనర్ కోటేరు ముత్తారెడ్డి, పార్టీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి పూలా రాంబాబు, కార్యదర్శి ఇప్పల కృష్ణారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షహనాజ్ బేగం, నువ్వుల విశ్వనాధం తదితరులు ఉన్నారు.

నేడు 27 వాటర్ ట్యాంకర్ల పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక మార్కెట్ యార్డులో గురువారం ఉదయం 9 గంటలకు ఎంపీ నిధులతో మంజూరైన 27 వాటర్ ట్యాంకర్లను విజయవాడ ఎంపీ కేశినేని నాని, ప్రభుత్వ విప్ ఉదయభాను పలు గ్రామాలకు పంపిణీ చేస్తారని ఎమ్మెల్యే ఉదయభాను కార్యాలయ ప్రతినిధి బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అనంతరం పట్టణంలోని శాంతినగర్ బి కన్వెన్షన్ పంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు జగ్గయ్యపేట పట్టణ బూత్ కమిటీ సభ్యులతో ఆత్మీయ సమావేశం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పాల్గొంటారని వివరించారు. కావున ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చౌటపల్లి(వీరులపాడు): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ రాజకిషోర్ తెలిపారు. మండల పరిధిలోని చౌటపల్లి, చట్టన్నవరం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాజకిషోర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

మహిళా చట్టాలపై డ్వాక్రా సభ్యులకు అవగాహన



పెనుగంచిప్రోలు: బాల్యవివాహాలు అరికట్టడంలో ప్రజల బాధ్యత ఎంతో కీలకమని, అందుకోసం వారికి మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మిషన్‌శక్తి కార్యక్రమంలో భాగంగా వీఎంబీకే, వీవో, స్వయం సహాయక సంఘాల సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా సాధికారత, మహిళా చట్టాలు, భేటీ బచావో..భేటీ పడావో కార్యక్రమాలతోపాటు బాల్య వివాహాలను అరికట్టడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, ఏపీఎం శ్రీనివాస రావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



నందిగామ: పట్టణ వాసులకు వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం చైర్‌పర్సన్ లక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 166 అంశాలపై చర్చించి తీర్మానం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ లక్ష్మి మాట్లాడుతూ పట్టణ పరిధిలోని 20 వార్డుల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వైస్‌చైర్మన్ పి.కృష్ణ, మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అలరించిన భక్తిరంజని

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన సూర్యప్రభ సంగీత అకాడమీకి చెందిన లలిత, శ్రీనిత్య, సురేఖ, జగన్మోహిని, అభిరామ్‌లు ఆలపించిన భక్తి రంజని భక్తులకు అకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై పలు అమ్మవారి కీర్తనలు ఆలపించారు. భక్తిరంజనిని ఎంతో ఆసక్తిగా వీక్షించారు.

నేటి నుంచి సంగమేశ్వరుడి కల్యాణోత్సవాలు



కూడలిలోని సంగమేశ్వర స్వామివారి ఆలయం



భక్తుల కోసం ఏర్పాటు చేసిన జల్లు స్నానాలు

నందిగామ: నేటినుంచి కూడలి సంగమేశ్వరుడి కల్యాణోత్సవలు ప్రారంభంకానున్నాయి. శివరాత్రి పర్వదినం అనగానే పశ్చిమ కృష్ణా ప్రజలకు ముందుగా గుర్తొచ్చేది కూడలి తిరునాళ్ల. నందిగామ మండల పరిధిలోని దాములూరు కూడలిలో వేంచేసియున్న శ్రీసంగమేశ్వరస్వామి ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. వైరా, కట్టలేరు సంగమ ప్రాంతంలో స్వామివారు స్వయంభువుగా వెలిసిన కారణంగా ఆయనను భక్తులు సంగమేశ్వరస్వామిగా కొలుచుకుంటారు. పశ్చిమ కృష్ణాలోని ప్రాచీన ఆలయాల్లో ఒకటైన సంగమేశ్వరస్వామి వారి ఆలయానికి ఓ ప్రత్యేక స్థానం ఉంది.శివరాత్రి పర్వదినాల్లో స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తారు. ముఖ్యంగా ఏటా మహాశివరాత్రి సందర్భంగా జరిగే స్వామివారి కల్యాణోత్సవానికి ఉమ్మడి కృష్ణా జిల్లాతోపాటు గుంటూరు, తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

ఆలయ స్థల పురాణం..

ఇక్కడ వెలసిన సంగమేశ్వరస్వామికి ఎంతో విశిష్టత ఉందని స్థలపురాణం చెబుతోంది. దాములూరు సమీపంలో ఉన్న వైరా, కట్టలేరు ప్రాంతాలు ఒకప్పుడు అటవీ ప్రాంతాలు. ఆ రెండు ఉప నదులు కలిసే ప్రాంతం కావడంతో కూడలిగా వాసికెక్కింది. అప్పట్లో కశ్యప మహర్షి ఈ ప్రాంతంలో శివలింగాన్ని ప్రతిష్టించి తపస్సు చేసుకున్నట్లు స్థలపురాణం చెబుతోంది. ఆ సమయంలోనే స్వామి వారికి ఓ చిన్న ఆలయం ఉండేది. కాలక్రమంలో ఆ ఆలయం శిథిలం కావడంతో రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు తన హయాంలో ఆలయాన్ని పునర్నిర్మించారు.



భక్తులు స్నానమాచరించేందుకు వీలుగా చేస్తున్న నీటి ఏర్పాట్లు

నేడు పెండ్లికుమారుడిని చేయుట..

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని పెండ్లికుమారుడిగా అలంకరించడంతోపాటు గణపతిపూజ చేయనున్నారు. శివరాత్రి పర్వదినం శుక్రవారం రోజున రుద్రహోమం, మూలమంత్ర హోమాలు, రాత్రి పదిగంటలకు స్వామివారి కల్యాణోత్సవం, శనివారం రుద్రాభిషేకం, పంచసూక్త హోమం, చివరిరోజైన ఆదివారం కుంకుమార్చనలు, పూర్ణాహుతి, వసంతోత్సవంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి..

సంగమేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా వైరా, కట్టలేరులలో నీరు లేకపోవడంతో జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, సామినేని ఉదయభాను చొరవతో నీటిని రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు స్నానాలు చేసేందుకు ఇబ్బందులు లేకుండా ఈ మేరకు చర్యలు చేపడుతున్నారు. అదేవిధంగా జల్లు స్నానానికి కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా స్వామివారి దర్శనానికి భక్తులు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు తీసుకున్నారు. మంచినీటి సదుపాయం, ఆలయం చుట్టూ బారికేడ్లు, షామియానాలు కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్నిఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.



ఆలయంలోని శివలింగం

మ్యానిఫెస్టోను 99శాతం అమలుచేశాం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మ్యానిఫెస్టోలోని హామీల్లో 99శాతం హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన వైనాన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సగర్వంగా చెబుతున్నామని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలం చింతలపాడు గ్రామంలో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలతోపాటు వారి ఇబ్బందులను అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, ఆయా పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్ గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ మ్యానిఫెస్టోలో చెప్పిన హామీలను ఇంతలా అమలుచేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. పేదల కోసం పనిచేసే పేదల పక్షపాతిగా ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారన్నారు. ఒక నాయకుడి నిబద్ధత, పనితీరుకు ఇంతకంటే కొలమానం ఏముంటుందని ఆయన పేర్కొన్నారు. మహిళలు, రైతులు, విద్యార్థులతోపాటు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా గత ప్రభుత్వాల మాదిరిగా కులమతాలు, పార్టీలకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి దేశానికే ఆదర్శంగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేయాలనే సమున్నత ఆశయంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికలలో అండగా నిలిచి ఆయన మరోసారి ముఖ్యమంత్రి అయ్యేందుకు ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచి షేక్ జానీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, గ్రామస్తులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



చింతలపాడులో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

ఎస్. అమరవరం గ్రామంలో..

ఎస్. అమరవరం(కంచికచర్ల): మా హయాంలో మేలు జరిగితేనే ప్రజలు తమ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని ఎస్.అమరవరంలో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి, వారి యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను వారికి అందజేశారు. తొలుత గ్రామ మహిళలు ఎమ్మెల్యేకు హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నిపార్టీలు పొత్తులు పెట్టుకున్నా, రానున్న ఎన్నికల్లో గెలిచిది తమ వైఎస్సార్‌సీపీయేనన్నారు. సీఎం జగనన్న తన పాలనలో ఇప్పటివరకు రూ.2.65లక్షల కోట్లను డీబీటీ ద్వారా పేదలకు అందజేశారన్నారు. పేదల అభ్యున్నతికోసం నేరుగా వారి బ్యాంకు ఖాతాలకే ఇన్ని లక్షల కోట్లను అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మినహా మరెవ్వరూ లేరని గుర్తుచేశారు. ప్రతి కుటుంబానికి మేలు చేకూరిందంటేనే తమ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి కోదాటి సీతారాం, సొసైటీ అధ్యక్షుడు కోదాటి రామకృష్ణ, నాయకులు పంచాయతీ కార్యదర్శి వనిత, వీఆర్వో ఎస్‌వీ రామారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



ఎస్.అమరవరంలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ

మోగులూరు(కంచికచర్ల): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోందని వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు పేర్కొన్నారు. మండలంలోని మోగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న 57మంది విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం కింద వేలాది కోట్ల రూపాయలతో చేపట్టిన పనులతో రాష్ట్రంలోని ఆయా పాఠశాలలకు కార్పొరేట్ హంగులు సమకూరాయని గుర్తుచేశారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకునేందుకు వీలుగా బైజూస్ ట్యాబ్‌లు ఉచితంగా అందజేసిందని వివరించారు. ప్రతివిద్యార్థి ప్రభుత్వం కల్పించే వసతులను సద్వినియోగం చేసుకుంటూ మెరుగైన ఫలితాలను సాధించాలని సూచించారు. పదేళ్లగా పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యేందుకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. పదోతరగతి విద్యార్థులంతా అత్యుత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం రంగారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్యాడ్, పెన్నులు అందజేస్తున్న వైస్ ఎంపీపీ మల్లికార్జునరావు

ప్రతిభను వెలికితీసేందుకే సైన్స్ ఎగ్జిబిషన్‌లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, సైన్స్ పట్ల ఆసక్తిని వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతో దోహదం చేస్తుందని, తద్వారా నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టవచ్చని శ్రీగౌతమ్ స్కూల్ డైరెక్టర్ ఎన్. సూర్యారావు తెలిపారు. చిట్టినగర్ శ్రీగౌతమ్ హైస్కూల్‌లో బుధవారం విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు నమూనాలు పరిశీలించి అభినందించారు. చంద్రయాన్–3, ఆదిత్య ఎల్–1, రోబో పని చేసే విధానం, గుండె పని తీరు, మెదడు పని తీరు. వ్యవసాయ రంగంలో నూతన వంగడాలు, తదితర అంశాలపై విశ్లేషించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ పి.తులసి, ఉపాధ్యాయులు సంజీవ్, సునీత, లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయం, ఆర్బీకే ప్రారంభం



కంభంపాడులోని సచివాలయ భవనం



రైతుభరోసా కేంద్రం

కంభంపాడు(వత్సవాయి): మండలంలోని కంభంపాడులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వం చేపట్టిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రూ.43 లక్షలతో సచివాలయ భవనం, రూ.23లక్షలతో రైతుభరోసా కేంద్రాలతోపాటు రూ.15 లక్షలతో ఎస్సీకాలనీల్లో డ్రైనేజీ పనులు పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు. త్వరితగతిన ఈ భవనాల పనులు పూర్తిచేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ భవనాలను జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను గురువారం ప్రారంభించనున్నట్లు అధికారులు వివరించారు.

నటుడు అక్కినేని విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన



భవానీపురం(విజయవాడపశ్చిమ):దేశం గర్వించతగ్గ మహానటుడు, దాదా పాల్కే అవార్డ్ గ్రహీత డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలో అక్కినేని శిలా విగ్రహం ఏర్పాటుకు బుధవారం శంకుస్థాపన, పూజా కార్యక్రమం జరిగింది. డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళా నిలయమైన ఈ కళాక్షేత్ర ప్రాంగణంలో అక్కినేని విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా స్థలం కేటాయించేందుకు కృషి చేసిన కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి)కు ధన్యవాదాలు తెలిపారు. సాంస్కృతిక రాజధానిగా పేరొందిన ఉమ్మడి కృష్ణాజిల్లాలోని విజయవాడలో మహానటుడు డాక్టర్ అక్కినేని విగ్రహ ప్రతిష్ఠకు శంకుస్థాపన చేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండాయిగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, మాదు కృష్ణారావు, డీ లక్ష్మీకుమారి, రాజు, రాజారావు, నాగమల్లిక పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామస్వరాజ్యం



శివాపురంలో రైతుభరోసా కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న విప్ ఉదయభాను, నాయకులు

విప్ ఉదయభాను

శివాపురం(పెనుగంచిప్రోలు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమైందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని శివాపురంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం(ఆర్బీకే), రూ.28 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను బుధవారం రాత్రి ఆయన ప్రారంభించారు. భవనాల నిర్మాణాలకు స్థలాలను అందజేసిన దాతలను అభినందించారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రజల ముంగిటకు పాలన అందించేందుకు, ప్రతి 2వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా 2లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు దక్కాయన్నారు. రైతు సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. మాట మీద నిలబడే వ్యక్తి సీఎం జగన్ అయితే...మోసానికి మారుపేరు చంద్రబాబు అన్నారు. చంద్రబాబును, ఆయన మోసపూరిత హామీలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేసిన దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి జగనన్న అని కొనియాడారు. అధికారంలో ఉన్నప్పుడు బీసీలన్నా, ఎస్సీలన్నా చులకనగా మాట్లాడే చంద్రబాబుకు..ఎన్నికల వేళ మళ్లీ బీసీలు గుర్తుకు వచ్చారన్నారు. నమ్మించి మోసగించే నైజమున్న చంద్రబాబును ప్రజలు నమ్మడం లేదన్నారు. పేదల సంక్షేమమే అజెండాగా ముందుకు వెళ్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అందరూ అండగా ఉండాలన్నారు. విజయవాడ పార్లమెంట్ అభ్యర్థిగా కేశినేని నాని, జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి తేళ్ల లక్ష్మణరావు, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు పూట్ల నాగమణి, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, మండల పార్టీ అధ్యక్షులు కనకపూడి భాస్కరరావు, శ్రీతిరుపతమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ లగడపాటి నాగేశ్వరరావు, పార్టీ గ్రామాధ్యక్షులు లగడపాటి జనార్దన్, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, గ్రామ ఉపసర్పంచి తాళ్లూరు నాగేశ్వరరావు, మాజీ సర్పంచి లగడపాటి మోహనరావు, గ్రామ నాయకులు ఏలూరి శివాజీ, ఏలూరి మధు, కురువెళ్ల రాయప్ప, ధారావతు మహేష్, లగడపాటి సురేష్, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, పార్టీ మండల మాజీ అధ్యక్షులు పూట్ల నాగేశ్వరరావు, బీసీ నాయకులు కోసూరి ప్రహ్లాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న విప్ ఉదయభాను

100 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన నేడు

నందిగామ టౌన్: నందిగామ నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నంగా ఉన్న 100 పడకల ఆస్పత్రి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో సాకారమవుతోందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. పట్టణంలోని 18వ వార్డు పరిధిలో రామన్నపేట రోడ్డు పక్కన నిర్మిస్తున్న 100 పడకల ఆస్పత్రికి గురువారం శంకుస్థాపన చేయనున్నారు. శంకుస్థాపన ఏర్పాట్లను వైద్యారోగ్య శాఖాధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ గురువారం ఉదయం 9.30గంటలకు శంకుస్థాపన చేస్తున్నామన్నారు. ఆస్పత్రి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషిచేస్తున్నట్లు వివరించారు. నందిగామ నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తున్నామని వివరించారు. నందిగామకు 100 పడకల ఆస్పత్రి ఆవశ్యకతను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే ఆయన తక్షణమే స్పందించి ఆస్పత్రి నిర్మాణానికి రూ.34.48 కోట్ల నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. ఆస్పత్రి శంకుస్థాపన కార్యక్రమానికి విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని), ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, వైద్యారోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, కమిషనర్ జె.నివాస్, కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్ కుమార్, సెకండరీ హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని కోరారు. ఎమ్మెల్సీ వెంట వైద్యారోగ్య శాఖ ఈఈ నాగార్జునరావు, డీఈ ఎస్‌వివి సత్యనారాయణ, మున్సిపల్ ఏఈ ఫణి శ్రీనివాస్, నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, పారుపల్లి హరిబాబు, బొల్లినేని శ్రీనివాసరావు, మన్నెం దాసు, తానూరి రాము ఉన్నారు.



ఆస్పత్రి శంకుస్థాపన స్థలం వద్ద ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

గ్రామాల్లో ప్రత్యేక పోలీసుల కవాతు



అనాసాగరంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



చిల్లకల్లులో కవాతు చేస్తున్న పోలీసులు

నందిగామ: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలోనూ ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని నందిగామ ఎస్‌ఐ హనీష్ తెలిపారు. పట్టణ శివారు అనాసాగరం, డివిఆర్ కాలనీలతోపాటు మండలంలోని అడవిరావులపాడు గ్రామాల్లో బుధవారం పోలీసులు ప్రత్యేక కవాతు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారులలో కవాతు నిర్వహించి, రం ప్రజలకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు.

చిల్లకల్లులో..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చిల్లకల్లులో పోలీసులు, ప్రత్యేక బలగాలతో కలసి బుధవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సతీష్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధుల్లో పోలీసులు కవాతు చేస్తూ శాంతిభద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాన్నున ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఎటువంటి భయాందోళనకు గురికాకుండా స్వచ్ఛందంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు.

సమన్వయ సమావేశం నేడు

పెనుగంచిప్రోలు: ఈనెల 25నుంచి జరుగనున్న శ్రీతిరుపతమ్మవారి చిన్న తిరునాళ్ల మహోత్సవాలకు సంబంధించి గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు అధికారుల సమన్వయ సమావేశం జరుగుతుందని ఈవో రమేష్‌నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి సత్రాల్లోని కల్యాణ మండప ఆవరణలో నిర్వహించే ఈ సమావేశానికి నందిగామ ఆర్డీవో ఎ.రవీంద్రరావు అధ్యక్షత వహిస్తారన్నారు. అన్నిశాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఈవో కోరారు.